క్లుప్తంగా

బీఎల్వోలతో సమావేశం



సోమశిల: ఓటరు నమోదు కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అనంతసాగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సూపర్‌వైజర్, ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల చేర్పులు, మార్పులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కలిగిరి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యుడు కే చంద్రశేఖర్ సూచించారు. తెల్లపాడులో ఆయుష్మాన్‌భవ వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యశాలలో సాధారణ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు



ఆత్మకూరు: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చేవూరి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచారు.ఈ కార్యక్రమంలో వన్నం నాగరాజు, పీ మస్తానయ్య, సయ్యద్ రసూల్, కేవీ విష్ణు, బాసీద్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలో పేకాటాడుతున్న 11 మందిని నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. ఉడ్‌హౌస్‌సంఘంలోని ఓ గదిలో పలు వురు పేకాటాడుతున్నారనే పక్కా సమాచారం ఇన్‌స్పెక్టర్ బాబీకి అందింది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 11 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.51,200ను స్వాధీనం చేసుకున్నారు.

భస్మాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాస త్రయోదశిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో భస్మాభిషేకాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని ఈఓ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు.

బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా వీరానాయక్

నెల్లూరు(క్రైమ్): బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్‌ను రేంజ్ కార్యాలయానికి బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. బాపట్ల సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వీరానాయక్‌ను ఈయన స్థానంలో నియమించారు.

శంకరమఠంలో మహాలింగార్చన నేడు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠంలో మహాలింగార్చనను ఆదివారం సాయంత్రం ఆరుకు నిర్వహించనున్నామని నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు శనివారం తెలిపారు. మహామృత్యుంజయ పాశుపత హోమాన్ని మంగళవారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వన భోజనాలు నేడు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాస పూజ, వన భోజనాలను రంగనాయకులపేటలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నామని వైఖానస సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్పగిరి రంగనాథస్వామి, విఖానస మహర్షికి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. జిల్లాలోని వైఖానస సంఘీయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సంక్షేమ పథకాల సారథి సీఎం జగన్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: రాష్ట్రంలోని గడప గడపకు సంక్షేమ ఫలాలను అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శశిరేఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ సమావేశంలో ఎమ్మెల్యే రామిరెడ్డి పాల్గొన్నారు. మండలాభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ప్రాణ నష్టం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టిన అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లను అభినందించారు. తుఫాన్ సమయంలో ఇంటి నుంచి బయటకురాని ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించకుండా ప్రజాధనాన్ని దోచేశారని ఆరోపించారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమచేస్తూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజు, రోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో అధికారులు ప్రత్యేక చొరవచూపాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

త్వరలోనే అల్లూరు పంచాయతీగా మార్పు

అల్లూరు, నార్త్‌మోపూర్, సింగపేటలను నగర పంచాయతీ నుంచి పంచాయతీగా త్వరలోనే మార్పు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే ఆమోదం తెలుపుతూ సంతకం పెట్టడం జరిగిందని, జీఓ విడుదలైన వెంటనే పంచాయతీగా మార్పు చేస్తామన్నారు. గిరిజన కాలనీలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ పథకాలను దృష్టిలో ఉంచుకుని పేద ప్రజల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. త్వరలోనే అల్లూరు పంచాయతీ కానున్నందున అల్లూరు, నార్త్‌మోపూర్, సింగపేట ప్రజలు పన్నుల బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ చంద్రశేఖర్, కమిషనర్ ఫణికుమార్, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, నాయకులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు



సోమశిల: అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడులో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సచివాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యాల పెంచలయ్య తెలిపారు. శనివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నగదు చెక్కును అందజేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి కృషితో సచివాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగిందని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పెంచలయ్య పేర్కొన్నారు. ఆయన వెంట మండల సచివాలయ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంఎల్ఓ మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

జనవరి 10న అపస్మా టాలెంట్ సెర్చ్ పరీక్ష



ఆత్మకూరు: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసే టాలెంట్ సెర్చ్ పరీక్షను పాఠశాల స్థాయిలో జనవరి 10న నిర్వహించనున్నట్లు అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని శ్రీనివాస ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో అపస్మా సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా అపస్మా ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.అపస్మా జిల్లా ట్రెజర్ పీ కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు జీ ప్రభాకర్, సీహెచ్‌వీ రమణారెడ్డి, ఎస్ రామ్మోహన్‌రెడ్డి, వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: పట్టణానికి చెందిన పలువురు బాధితులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఏడాదిగా మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్న 18వ వార్డుకు చెందిన నాగమల్లేశ్వరికి రూ.10వేలు సాయం అందజేశారు. 15వ వార్డు గిరిజనకాలనీకి చెందిన రాగి పోలయ్య, 20వ వార్డు ఎస్సీకాలనీకి చెందిన కావాటి పాపయ్య, 3వ వార్డుకు చెందిన సయ్యద్ ఖాదర్‌బాషా, 19వ వార్డుకు చెందిన తిరుమలశెట్టి సుబ్బమ్మ మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, గంధళ్ల వేణు, వార్డు ఇన్‌చార్జి షేక్ రహీం, కొండా వెంకటేశ్వర్లు, పులిమి శైలజ, కుడుముల సుధాకర్‌రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, రమణమ్మ పాల్గొన్నారు.

పర్సులోని బంగారం, నగదు అపహరణ

సంగం: పొదలకూరు నుంచి సంగం వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి కర్రల సంచిలోని పర్సు, అందులోని బంగారం, నగదు అపహరణకు గురైన ఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు..అనంతసాగరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రసన్న తన కుమార్తెతో కలిసి శనివారం ఉదయం పొదలకూరులో నివాసం ఉంటున్న అక్క వద్దకు వెళ్లింది. ఆమె వద్దనున్న ఒకటిన్నర సవర బంగారు చైన్, మూడు ఉంగరాలు, రూ.4 వేల నగదును ఓ పర్సులో పెట్టి కర్రల సంచిలో ఉంచింది. సాయంత్రం 4 గంటలకు పొదలకూరు నుంచి సంగం వచ్చే బస్సు ఎక్కింది. డ్రైవర్ వెనుక సీట్లో కూర్చుని సంగం శివాలయం సెంటర్‌లో బస్సు దిగింది. పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపులో నీళ్లు తాగి చూడగా తన కర్రల సంచిలోని పర్సు కనిపించలేదు. దీంతో పర్సు చోరీకి గురైందని, అందులోని ఒకటిన్నర సవర బంగారు చైన్, మూడు ఉంగరాలు, రూ.4 వేల నగదు అపహరణకు గురయ్యాయని కన్నీరుమున్నీరుగా విలపించింది. అనంతరం సంగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూచీకత్తు లేని రుణాలతో స్వయం ఉపాధి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొడవలూరు : ప్రభుత్వం అందజేసే పూచీకత్తు లేని రుణాలతో స్వయం ఉపాధి పొందవచ్చని ఈఓపీఆర్డీ డేవిడ్ సూచించారు. మండలంలోని తలమంచిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శనివారం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డులు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా పూచీకత్తు లేని రుణాలు పొందేలా పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా రూ.2 లక్షల వరకు రుణం పొందే వెసులుబాటు ఉందన్నారు. ఇందుకోసం విశ్వకర్మ సంకల్ప యోజన, ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, కేవీసీ తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ ఎం.రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పొదుపు సంఘాలకు రుణాల చెక్కులను పంపిణీ చేయడంతో పాటు డ్రోన్‌లతో ఎరువులు, పురుగు మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.భాస్కర్, బీజేపీ నేతలు కె.రాజేశ్వరమ్మ, విజయశ్రీ, రాఘవేంద్రరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కుటుంబ వేడుకగా వనభోజనాలు

నెల్లూరు(బృందావనం): అఖండ ఆర్యవైశ్య కుటుంబ వేడుకగా ఆర్యవైశ్య కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. నగరంలోని వేణుగోపాలస్వామి డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న వనభోజన మహోత్సవ ఏర్పాట్లను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పది వేల మంది ఆర్యవైశ్యులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో 500 మంది దంపతులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. పేర్ల సీతారామారావు, శ్రీరామ్ సురేష్, సుంకు మనోహర్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్, సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పీ సునీలత తెలిపారు. శనివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చెర్లోయడవల్లి అంగన్‌వాడీ కార్యకర్త–1, చేజర్ల–1, కండ్రిక –1, నెర్నూరు–1, కరటంపాడు–1, నువ్వూరుపాడు–1, జంగాలదొరువు–1, జెండాదిబ్బ–1 చొప్పున అంగన్‌వాడీ సహాయకుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని క్రీస్తు సంఘం చర్చి 45వ వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు దైవసంఘం దైవ సేవకులు ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవ గీతాలను ఆలపించారు. క్రీస్తు సంఘం పెద్దలు జేమ్స్ పవన్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



చేజర్ల: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శనివారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మెహతాబ్ గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. అనంతరం పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ ఏవీ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేయించాలని విజ్ఞప్తి



చేజర్ల: మండల రైతాంగానికి సోమశిల జలాశయం నుంచి దక్షిణ కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయించాలని మండల రైతులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో మండల రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమయంలో దక్షిణ కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయిస్తే రైతులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని ఎమ్మెల్యేకు వివరించారు.

అన్నదాతలు రుణపడి ఉంటారు

సోమశిల: సోమశిల జలాలతో సాగునీటి భరోసా కల్పించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి రైతులు రుణపడి ఉంటారని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సాగునీటి సమస్యను తీసుకెళ్లి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సాగునీటి విడుదలకు కృషి చేశారన్నారు. సోమవారం సోమశిల ఉత్తర కాలువకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి నీటిని విడుదల చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఆత్మకూరు, కనుపూరుపల్లిలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కనుపూరుపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పునరుద్ధరణ పనులను పరిశీలించి ఐడీసీ అధికారులతో చర్చించనున్నారు. అనంతరం ఆత్మకూరులోని 8వ వార్డు కౌన్సిలర్ రాధికారెడ్డి ఇంటి వద్ద పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

సోమేశ్వరాలయ పూర్వ వైభవానికి కృషి



సమీక్షిస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): సోమశిలలోని సోమేశ్వరాలయ పూర్వ వైభవానికి నిర్మాణ పనులను చేపట్టాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయ నిర్మాణ విషయమై దేవదాయ శాఖ జిల్లా అధికారులు, అనంతసాగరం మండల నేతలతో కలిసి సమీక్షను నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2020లో సంభవించిన తుఫాన్ కారణంగా వచ్చిన వరదలతో ఆలయం కూలిపోయిందని చెప్పారు. ఆలయ పునర్నిర్మాణ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, దేవదాయ శాఖ ద్వారా రూ.కోటిని కేటాయించారన్నారు. సీజీఎఫ్ ద్వారా మరో రూ.50 లక్షలతో ఆలయ పునర్నిర్మాణ పనులను చేపట్టనున్నామని వెల్లడించారు. పునర్నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను డిసెంబర్ 14వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు చేపట్టనున్నామని తెలిపారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఈఓ ప్రసాద్, ఆలయ అర్చకుడు అన్నవరం రామకృష్ణ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ ఎన్ కోటారెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఎన్ కోటారెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో నేరాల కట్టడికి ప్రత్యేకంగా నిఘా బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. నిఘా బృందాల సాయంతో ఎప్పటికప్పుడు నేరాల సమాచారం తెలుసుకుంటూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే, ప్రోత్సహించే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని తెలియజేసి నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. గంజాయి, తదితర మత్తు పదార్థాలను సరఫరా చేసినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా మండల పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



పల్లె నిద్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మర్రిపాడు: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో సింగనపల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో మండల బూత్ కన్వీనర్ రేవూరి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెవుల శ్రీనివాసులు, సింగనపల్లి సర్పంచ్ రాచాల శ్రీనివాసులు, నాగినేనిగుంట సర్పంచ్ సత్యం, నాయకులు కాశిరెడ్డి, శివసాయికుమార్ రాజు, చింతగుంట రామకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఖాన్‌సాహెబ్, మీరావలి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కారం



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి బీ రాజేష్

ఆత్మకూరు: కక్షిదారులు రాజీపడి వస్తే లోక్ అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరిస్తామని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ తెలిపారు. ఆత్మకూరు సబ్‌కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆత్మకూరు కోర్టులో పెండింగ్‌లో ఉన్న 2332 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. అందులో సివిల్ 7, బ్యాంకు 5, ఎక్సైజ్ 180 కేసులు కాగా, మిగిలినవి క్రిమినల్ కేసులని చెప్పారు. ఈ కేసులకు సంబంధించి రూ.18,09,965 వసూలు చేసి అందించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు, కక్షిదారులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రభుత్వ సాయం పంపిణీ



కలిగిరి: తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఇబ్బందులు పడిన కలిగిరి పంచాయతీ పరిధిలోని వెంకన్నపాళెం ఎస్టీ కాలనీవాసులకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచనలతో బాధితులకు ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఉల్లిపాయలు, నూనె, కందిపప్పు, కూరగాయలు అందజేసినట్లు తెలిపారు. డీటీ మురళీధర్‌రాజు, పీఏసీఎస్ చైర్మన్ బొర్ర మస్తాన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్, వీఆర్వో చిన్నరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

జంప్‌రోప్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం



సంగీతకు ఆర్థిక సాయం అందజేస్తున్న చిరంజీవిరెడ్డి

కలిగిరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చలంచర్ల సంగీతకు ఇంటర్నేషనల్ జంప్ రోప్ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి శనివారం రూ.85వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జంప్‌రోప్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీ మురళి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు థాయిలాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ జంప్‌రోప్ పోటీల్లో పాల్గొననున్న సంగీతకు ఖర్చుల నిమిత్తం చిరంజీవిరెడ్డి నగదు సాయం అందజేయడం అభినందనీయమన్నారు. చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ సంగీత అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకం సాధించి దేశం, రాష్ట్రం కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. వెలగపాడు సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సభ్యుడు గాలి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థినులకు వైద్యపరీక్షలు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై వసతిగృహ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు షేక్ అస్మా సూచించారు. పట్టణంలోని ఎస్టీ బాలుర, జెడ్పీ బాలికల, బీసీ బాలికల వసతి గృహాలను శనివారం ఆమె సందర్శించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. హాస్టల్ వార్డెన్లు మమత, సుజన, పద్మనాభరెడ్డి, వైద్య సిబ్బంది సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.